శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై॥

సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబుజీకీ జై

# గురుకృప

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో

మానసా! కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!

ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో

నిలిచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా

భాసించేటట్లు చెయ్యి!

ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు

చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!



## గురుపూర్ణిమ సంచిక

సంపుటి 4 త్రైమాసిక పత్రిక జూన్ 2001

# సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి, ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయిప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ "సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!"
అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నాఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో
ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

-- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి!లేడోయి | శ్రీ బాబూజీ |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట | గురుబంధువులు |
| 3. | వేచి చూడు వేదనతీర్చు గురువు | యస్. సత్యవతి |
| 4. | పాపకి ప్రాణభిక్ష-బాబూజీ చేతి రక్ష | పి.రాధ |
| 5. | సర్వాంతర్యామి-సర్వసాక్షి సద్గురువే | కె.జ్యోతి |
| 6. | అడుగడుగునకు సద్గురుని అనుగ్రహముంది | లక్ష్మి |
| 7. | గురుపూర్ణిమ | గురుబంధువులు |
| 8. | లేదు లేదిక మీ కరుణకు పోలిక | రుక్మిణి |
| 9. | కదలాడు దైవమే గురువాయె నాకు | మణి మూర్తి |
| 10. | ఆదమరచి వున్నా-గురువు నిన్ను ఆదరించునన్నా | -- |
| 11. | గతితప్పని శరణాగతి | రాధాకృష్ణ |
| 12. | ఆచేయి ఎంత హాయి (భాగం -13) | డా\|\|యస్.సాయివరప్రసాదరావు |
| 13. | మహనీయుల మహితోక్తులు | గురుచరణ దాసుడు. |

# ఉన్నమాట - అనుకున్నమాట

'గురుపూర్ణిమ' గురువునే పరమ ఆరాధ్యదైవంగా ఆరాధించేవారికి పర్వదినం.

'బాబా' నిర్దేశించిన ఏకైక ఉత్సవిమదే. దాదాకేల్కర్ కు బాబా ఉద్దేశించి చెప్పిన భావాన్ని ఎందరో ఎన్నోవిధాలుగా "గురుపూర్ణిమ" ప్రాశస్త్యాన్ని, ఆవశ్యకతను వివరించారు, విశదీకరించారు. కాని ఈనాడు గురుపూర్ణిమంటే వేడుక కోసమో!మ్రొక్కుబడిగా చేసుకోవడమో! కనిపిస్తున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నది - అవగాహనా రాహిత్యమే ప్రధాన కారణం. గురుపూర్ణిమంటే మనమెలాంటి ఆలోచనలో వున్నామో! ఏ విధంగా అనుసరిస్తున్నామో! వేటి వేటికి ప్రాధాన్యమిస్తున్నామో! సింహావలోకనం చేసుకోవలసిన అవసరముంది. ముందుగా "గురుపూర్ణిమ" అంటే ఏమిటో తెలియాలి. అది మన జీవన విధానానికి, ఆధ్యాత్మికానుభాతికి ఎలా ఉపకరించగలదో, ఎంతగా అవసరమౌతున్నదో గుర్తించగల్గాలి. ఎలా చేస్తే నిజమైన గురుపూర్ణిమౌతుందో, గురుమహోత్సవమౌతుందో తెలుసుకోవాలి! ఈనాడు గురుపూర్ణిమ రోజున వారివారి ప్రియ గురుదేవుల చిత్రపటాలకు నిలువెత్తు పూలదండలు, కిలోల కొలది పూలు కుమ్మరించి రాశి పెంచి భక్తివిశ్వాసాలంటే ఇదేనని తృప్తిపడిపోతే సరిపోతుందా? అలాకాదని నగర సంకీర్తనపేరుతో నాలుగు వీధులు తిరిగి వారి ఔన్నత్యాన్ని ప్రదర్శించితే ఓ పనైపోతుంది. ఇవేవి కాకుంటే ఏకాహాలు పేరుతో భజన సాగించి తాళాలు అరిగిపోయేలా, గొంతులు బొంగురుపోయేలా పొంగిపోతే అదోరకమైన సంతృప్తి, కాదంటే సామూహిక పారాయణ సాగించి, అమ్మయ్య అనుకుంటే అదో మానసిక వికాసం.

జపమాల చేతిలో ధరించి నామజపం చేస్తూ గోడగడియారం వంక చూస్తూవుంటే గంపల కొలది పుణ్యంలభించినట్లే. సొంతసొమ్ము ఏ మాత్రం లేకుండా 'పరార్ధంతో' అన్నదానం సాగించితే సొమ్మొకడిది సోకక్కడిది అన్న సామెతలా వుంటుంది. ఇలాంటి ఏర్పాట్లనే మనం అధికంగా చూస్తున్నాం.

గురుపూర్ణిమ మహోత్సవాన్ని వైభవోపేతంగా చేసుకోవాలనుకోబేయే ముందు గురుహృదయాన్ని అవగతం చేసుకొని, ఆ మహనీయుని భావాలను చదవాలి. గురుపథమ్లో పయనించబోయేముందు పథనిర్మాణమ్లోని మూల సూత్రాలను ఆచరించాలి. ఉ|| మనం పయనిస్తున్నమార్గమ్లో బాటకిరువైపుల నాటిన మొక్కలను గమనిస్తాం. ఆ మొక్కలను ఎవరు నాటారు? మొక్కలను శోభనిస్తున్నదేమిటి? గుభాలిస్తున్న, పరిమళింప చేస్తున్న పుష్పాలేమిటి? ఫలవంతములైన ఫలాలేమిటి? వాటి రుచి ఎటువంటిది? మార్గమద్యంలో దాహార్తుల దాహం తీర్చు చలివేదాలున్నట్లే, గురుపథంలోని ఆశలు, ఆశయాలు, ఆదర్శాలు, త్యాగాలు, హితోక్తులు ఎన్నింటినో తెలుసుకోవాలి. తెలుసుకోవడమ్లో ఎంత తృప్తి వుంటుందో! ఆచరణంలోను అంతటి తపనుండాలి! ప్రతి అంశంలోను గురుగమనాన్ని, గురువచనాన్ని అనుక్షణం, అనుశీలకుడై సంచరించాలి. ఆర్భాటాలు, హంగులు కాకుండా ఆచరణ, ఆత్మీయతలు ప్రధానంగా చేసి అర్చించగలగడం గురుపూర్ణిమ మహోత్సవానికి నాంది కాగలదు. అంటే ఇక్కడ దండలు, పూలు, నైవేద్యాలు అధికంగా అర్పించటాలుండవు. "మానసభజరే గురుచరణం" అన్న భజన గీతంలోని భావసౌందర్యాన్ని గుర్తించాలి. ప్రతి అమావాస్యకు పాము కుబుసాన్ని విడిచిన రీతిగా, సాధకుడు తనలోని మలిన భావాలను, మలిన వాసనలను విడనాడాలి. నైతిక విలువలను పెంచుకోగలగాలి. సత్యవాక్యము పై అభిరుచి వుండాలి. ధర్మగుణం, దాసగుణం, దయాగుణము జీవన స్రవంతిలా ప్రవహించాలి. "త్యాగగుణము" అన్నింటికన్నా అధికస్థానం ఆక్రమించగలగాలి. దర్పణం మీద పడిన ధూళిని పరిశుభ్రం చేస్తున్న రీతిగా దుష్టసంకల్పాలను గమనించగలగాలి. కలుపుమొక్కలవంటి భావాలను ఎప్పటికప్పుడు పెకిలించుకోగలగాలి. తానేమార్గంలో పయనిస్తున్నది ముఖ్యంగా ఉద్దీక్తుడై వుండాలి. తన చర్య గురువుకెంత దగ్గరౌతున్నది. తన దుష్టగమనం వలన గురువు కెంతటి అపవాదు కలిగించనున్నదో ప్రతి క్షణం గమనించుకోవాలి.

భాగవత భక్తిమార్గంలో మాతృశుద్ధి, పితృశుద్ధి, అన్నశుద్ధి, ఆత్మశుద్ధి సచ్ఛిష్య లక్షణాలుగా చెప్పింది. అట్టివారికే 'గురుకృప' లభిస్తుంది. అట్టి శిష్యుడు సమర్పించే సేవలే గురునికి ఇష్టమై "గురుమహోత్సవము" - గురుపూర్ణిమై గురువుకు ఇష్టంకాగలదు.

గురువుకు ఇష్టమైనది చేయగల్గడమే నిజమైన గురుపూర్ణిమ.

## వేచి చూడు వేదనతీర్చు గురువు

నా అనుభవాన్ని గురుకృఉపద్వారా గురుబంధువులతో పంచుకోవాలని, గురుదేవుల అనుగ్రహంతో వ్రాస్తున్నాను. మా బంధువులు మా ఊరినుండి మాకు బియ్యం పంపుతూ, కార్డు రిజిస్టర్ పోస్టులో పంపించుతారు. క్రిందటి సారి పోస్టు చేసిన కవరు మాకు చేరలేదు. ఫోన్ చేస్తే డూప్లికేట్ పంపించుతాముఅని , పంపించారు. అది కూడా మాకు చేరలేదు. పోస్టుమేన్ ను అడిగితే రాలేదండి అన్నారు. ప్రతిరోజు బాబాకు, గురువుగారికి నమస్కరించుకుంటూ, నీవు తప్ప ప్రపంచంలో ఆశ్రయం యిచ్చి రక్షించువారు ఎవరూ లేరు అని నేను నిన్ను ప్రార్థించితే ఇలా చేసావేమిటి? ఈ రోజు కాని కార్డు రాకపోతే చూడు అని, నేను అంటువుండగానే శారద, నారాయణి అనే గురుబంధువులిద్దరు బాబా ఉంగరము తీసుకొని,చిటి(సత్యవతి) నీకు చూపించుదాము అని తెచ్చాము, అని పిలిచారు. నేను బయటకు వచ్చేసరికి పోస్టుమేన్ కవరు తీసుకొని వచ్చారు. మీరు చాలా అదృష్టవంతులు, ఈ రోజు కవరు వెనుకకు పంపించివేయడానికి ప్రక్కన పెట్టినారు. మీరు ప్రభాకర్ గారి పేరు చెప్పడం వల్ల ఒకసారి ఆ లెటర్ చూద్దామనిపించింది. లెటర్ కనిపించడంతో తీసుకొని వచ్చాను అన్నారు.

నా ఆనందానికి అంతులేదు. ఏదో కాకతాళీయంగా వచ్చింది అనుకుందామంటే కవర్ మీద సెక్టార్ నెంబరు లేదు. సెక్టార్ నెంబరు లేకుండా ఎట్టిపరిస్థితిలోను లెటరు చేరదు. చివరి నిమిషం వరకు వేచిచూచి తన భక్తులను గురువుగారు ఎలా అనుగ్రహించుతారో ఇంతకంటే నిదర్శనము ఏమి కావాలి.

ఉక్కునగరం (విశాఖ) — గురుబంధువు

సెక్టార్ 11 (14-4-2001) — యస్. సత్యవతి (చిట్టి)

## "పాపకి ప్రాణభిక్ష - బాబూజీ చేతి రక్ష"

నేను 2 సం||ల నుండి రోజు(గురు, శనివారంలు తప్ప) గురుబంధువులతో కలసి నామం చెప్పకొనేదాన్ని. తరువాత వాళ్ళు నాకు గురువుగారి అనుభవాలు చెప్పేవాళ్ళు, అలా నేను గురువుగారికి దగ్గరయ్యాను. నాకు మొదటిసారి బాబు పుట్టి చనిపోయాడు, రెండవసారి పాప పుట్టిన వెంటను గురకలాంటిది వచ్చింది. హాస్పటల్ లో చేర్పించాము. 3 రోజులవరకు డాక్టరుగారు ఏమిచెప్పలేదు. నేను రోజు గురువుగారికి చెప్పకొని ఊది పాపకు పెట్టమని డాక్టర్ గారికి ఇచ్చేదాన్ని. పాప ఇప్పడు గురువుగారి దయవల్ల ఆరోగ్యంగా వుంది. గురువుగారు మా పాపకు ప్రాణభిక్ష పెట్టారు. అసలు నేను ఎప్పడూ సత్సంగాలలో కూడా పాల్గొనలేదు. గురువుగారు తనని నమ్ముకొన్నవారిపై ఎంత దయ చూపిస్తారో నా అనుభవం వలన అందరికి తెలియాలి. చాలా మంది నా చెయ్యిచూసి నీకి పుట్టిన పిల్లలు బ్రతకరు అని చెప్పారు.

ఏప్రిల్, 2001 — పి. రాధ(బుర్రిపాలెం)

> నాకు గురువు, భగవంతుడు ఒకేసారి దర్శనమిస్తే నేను ఎవరికి ముందుగా నమస్కారము చేస్తానని నన్నడిగితే.....
>
> నేను గురువుకే నమస్కరిస్తానని చెప్పగలను. ఎందువల్లనంటే,
>
> గురువు నాకు తెలివిని కలుగజేయకపోతే ఆ వచ్చినవాడు భగవంతుడని నాకు తెలియదుగదా - అని .... కబీరు

## సర్వాంతర్యామి - సర్వసాక్షి సద్గురువే

ముదుగా సాయినాథునికి, శరత్ బాబూజీ గారికి మన: పూర్వకముగా సాష్టాంగ నమస్కారములు తెలుపుకొంటున్నాను. నన్ను మా బావగారైన శ్రీనివాస్ గారు, గురువుగారు నా కందించిన లీలను గురించి వ్రాయమన్నారు. ఎలా వ్రాయాలో తెలియని నాకు గురువుగారే దగ్గరుండి నా చేత వ్రాయించుకుంటారనే ధైర్యంతో వ్రాస్తున్నాను.

నేను మొదటగా గురువుగారిని చూసింది జులై 15,2000 న, ఆ రోజు గురువుగారిని చూడగానే నాకు కలిగిన ఆనందం నేను మాటల్లో చెప్పలేను. ఆ మరుసటి రోజు ఉదయం గురువుగారు పెళ్ళిమండపంలో దర్శనమిచ్చినారు, అక్కడ గురువుగారితో కొందరు గురుబంధువులు వారి పిల్లలకు అక్షరాభ్యాసము, అన్నప్రాసన చేయించుకున్నారు. అది చూచిన వెంటనే అయ్యో నా పాపని తీసుకొస్తే, నా పాపకు కూడా గురువుగారి దగ్గర అక్షరాభ్యాసము చేయించుకొనే భాగ్యం కలిగేదని పలుమార్లు అనుకున్నాను. ఆ వెంటనే నేను మా పాపకు అక్షరాభ్యాసము గురుసన్నిధిలోనే జరుపుకోవాలని మనసులు అనుకున్నాను. మేము వెళ్ళేరోజున గురువుగారు పాదదర్శనము ఇచ్చినారు. అప్పుడు ఈ విషయం గురించి గురువుగారికి చెప్పాలనుకున్నాను. కాని గురువుగారి దర్శనముతో, గురుదేవుల పాదములు తాకిన ఆనందములో నేను అనుకొన్నదంతా మర్చిపోయాను. కాని బయటకు వచ్చాక విషయం గుర్తుకు తెచ్చుకొని ఎంతో బాధ పడ్డాను. కాని ఆ క్షణం లో గుర్వుగారు సర్వాంతర్యామి అని, మనము మనస్సులో అనుకున్నవి గురువుగారికి తెలియవా? బయటకే చెప్పాలా? అన్న విషయం గుర్తుకు రాలేదు. కాని ఆయన నా కోరిక తీర్చారని ఆయన నాకందించిన లీలను అనుభవించాక కాని నాకు తెలియలేదు.

మేము తిరిగి 19న బయలుదేరి వచ్చేశాము. తరువాత దసరాకి వారం ముందుగా మా మామగారు పాపకు అక్షరాభ్యాసం చేద్దామన్నారు. అప్పుడు నేను షిర్డీలో చేద్దామనుకున్నానని చెప్పాను. మా మామయ్య అక్షరాభ్యాసానికి అంతదూరం వెళ్ళాలా, మా ఊరైన రావికంపాడులో చేద్దామని చెప్పారు. ఆ ఊరిలో దసరా రోజున గుడిలో ప్రత్యేక పూజ మా మామగారిచేత చేయిస్తారు. ఆరోజునే మా పాపకు అక్కడే అక్షరాభ్యాసం చేద్దామని చెప్పారు. నేను గురువుగారి ఫోటో వద్ద కూర్చొని బాధపడినాను. నేను మీ వద్ద చేసుకుందామనుకునంటే ఇలా అయ్యిందేమిటని బాధపడినాను. మీరే నా కోరిక తీర్చాలి అని ప్రాధేయపడినాను. దసరా రోజు పాపను తీసుకొని నేను, మావారు రావికంపాడు వెళ్ళాము. అక్కడ శ్రీరాముల వారి మందిరమే ఉన్నది. ఆ గుడిలోనే అక్షరాభ్యాసమన్నారు. సరేనని నేను పాపను తీసుకొని ప్రదక్షిణలు చేసి గుడిలోపలకు వెళ్ళుచుండగా, ఎదురుగా బాబా, గురువుగారు వున్న ఫోటో కనపడింది. నేను ఆశ్చర్యపోయి ఒక క్షణం అలా కదలక, మెదలక వున్నాను. ఎందుకంటే అంతకు ముందు రెండుసార్లు వచ్చానుకాని అప్పుడు కనపడని ఫోటో ఈ రోజు ఎలా కనపడిందో నాకు అర్థంకాలేదు. అదంతా గురువుగారిలీల అని ఎంతో ఆనందానికి గురి అయ్యాను. నా కోరిక తీర్చారనుకుంటూ గురువుగారి సన్నిధిలో మా పాప అక్షరాభ్యాసాన్ని ఆనందంగా జరుపుకున్నాము. తిరిగి రాత్రికి తెనాలి వచ్చి వైజాగ్ లో వున్న మా అమ్మకు జరిగినదంతా ఫోనులో చెప్పినాను. అమ్మ, మరుసటి రోజు వైజాగ్ లో వుంటున్న మా బావగారికి, అక్కకు ఈ విషయం తెలిపింది. అప్పుడు మా బావగారైన శ్రీనివాస్ గారు ఆ ఫోటో గురువుగారి ఆజ్ఞమీద 7,8 సం||ల క్రితమే ఊరూరా తిరుగుతూ, సత్సంగం చేసిన ప్రతిచోట బాబా ఫోటో వుంచామని, అలానే రావికంపాడు ఆలయంలో కూడా వుంచారని చెప్పారు. ఈ విషయం అమ్మ నాతో చెప్పగా నేను పడిన ఆనందానికి, ఆశ్చర్యానికి అంతులేదు. నేను ఇంతకు మునుపు రెండు సార్లు వెళ్ళినా కనపడని గురువుగారు ఆ రోజు నా కళ్ళ ముందు ప్రత్యక్షమవ్వడం నిజంగా గురువుగారి అద్భుతమైన లీల కాక మరేమిటి! ఇలా గురువుగారు నా కందిస్తున్న అనుగ్రహాన్ని ఎప్పుడూ ఎరుకలో వుంచుకోవాలని గురువుగారిని ప్రార్థిస్తున్నాను. ఆ ఎరుకలో వుంటూ సాయిపథంలో నడవాలని మనసారా కోరుకుంటున్నాను. ఇదంతా గురువుగారి కృపతోనే వ్రాయగలిగానే తప్ప నా ప్రమేయమేమి లేదని తెలుపుకుంటున్నాను.

కాకానినగర్ (విశాఖ) — ఇట్లు

14-4-2001 — జ్యోతి

## "అడుగడుగునకు సద్గురుని అనుగ్రహముంది"

గురుమహిమ అపారమనేది నాకు సంబంధించిన ప్రతి చిన్న విషయంలో గురువుగారు చూపిన అనుగ్రహంద్వారా అది ఎంత సత్యమో నాకు తెలిసింది. మా బాబు విషయంలో బాగా గ్రహింపులోనికి వచ్చింది. మా బాబు సునీల్ బాగా చదివి పరీక్ష వ్రాసినా మార్కులు మాత్రం సరిగా వచ్చేవికావు. నేను, మా అబ్బాయి సత్సంగములో, మా బాబు కాలేజి ఫస్ట్ రావాలని, 86% రావాలని ఇద్దరం కోరుకున్నాము. మేమిలా గురువుగారిని అడిగామని మా వారితో చెప్పగా ఆయన మా మాటలు కొట్టిపారేసారు. ఆ తరువాత ఆ విషయం మేము కూడా మర్చిపోయాము. కాని గురువుగారు మాత్రం కోరుకున్నట్లుగానే మా బాబుకి పరీక్షలో 86% వచ్చేట్లు, నా కోరిక ప్రకారం కాలేజి ఫస్ట్ వచ్చేట్లు అనుగ్రహించారు.

మా అబ్బాయి స్కూటరుమీద వెళ్ళేటప్పుడు ఇంకొక స్కూటరు ఎదురుగా వచ్చి గుద్దింది. డ్రైవ్ చేస్తున్న బాబుకి బాగా దెబ్బలు తగిలాయి కాని మా బాబుకి మాత్రం ఒక్క దెబ్బకూడా తగల్లేదు. ఇది నిజంగా అద్భుతంగా తోచింది. ఇదంతా గురువుగారి కృపే అని మాకు తెలుసు. మా మాటలు కొట్టేసిన మా వారిలో కూడా మార్పువచ్చి బాబాని, గురువుగారిని పూజిస్తున్నారు.

మా వారు కొన్నాళ్ళుగా ఏ పని లేకుండా వున్నారు. మా వారికి ఏదైనా పని చూపించమని షిర్డీవెళ్ళినప్పుడల్లా మరియు సత్సంగములో గురువుగారిని కోరుకునేదాన్ని. అంతేకాకుండా మాకు ఇంకొకరు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇప్పించమని కోరేదాన్ని. ఈ రెండింటికి గురువుగారు పరిష్కారాన్ని చూపించారు. ఎప్పటినుండో రాని డబ్బులు సడన్ గా అతను ఇచ్చేస్తానని అనడం, ఈ లోగా సిమెంటు, హార్డ్వేర్-షాపు పెటుకోవాలనే ఆలోచన రావడం, షాపుకి రెంటు కూడా కట్టక్కరలేకుండా చేయడం, ఇవన్ని 10 రోజులలో జరిగిపోయినవి. ఏప్రియల్ 26న షాపుని ప్రారంభించాలనుకున్నాము. ఇదంతా గురువుగారి అనుగ్రహమేనని మేము నమ్ముతున్నాము.

షిర్డి వెళ్ళినపుడు, గురువుగారిని సత్సంగము మా ఇంటిలో పెట్టుకోవడానికి అనుమతి అడగాలని, అడగలేకపోయాను. కాని నేను ఇంటికి వచ్చాక, సత్సంగానికి వెళ్ళినపుడు శ్రీనివాస్ గారు మీ ఇంటిలో సత్సంగము పెట్టుకోండి అన్నప్పుడు, నాకు గురువుగారే ఈ విషయం ఆయన చేత చెప్పించారనిపించింది. ఇప్పుడు మా ఇంటివద్ద ప్రతిసోమవారం ఉ|| 10-30 ని||లకు సత్సంగం జరుగుతుంది.

దీనివలన గురువుగారిని అడగకపోయినా, మన మనస్సులో వున్నదాన్ని కూడా గుర్తించి, ఆయనే తీరుస్తారనే నమ్మకం నాలో కలిగింది. సత్సగము చేసుకొనే హాలు గచ్చుపోయింది. సత్సగములో గురువుగారిని గచ్చు చేయించమని అడిగాను. నేను గచ్చు చేయించలేనని చెప్పిన మా ఇంటి ఓనర్ వెంటనే గచ్చు చేయించారు. ఆయన అడ్వాన్సు ఏమైనా అడుగుతారేమోనని భయపడి గురువుగారితో చెప్పుకున్నాను. కాని అదేమి అడుగకుండా హాలులోనే కాకుండా ఇంటి చుట్టూకూడా గచ్చు చేయించారు. ఇలా ప్రతి విషయంలో గురువుగారు మమ్మల్ని కాపాడుతున్నారనే నమ్మకం నా అనుభవాల ద్వారా నాకు ఏర్పడింది. ఏ సమస్య వచ్చినా తీర్చవలసింది - గురువుగారే!!

ఈ నా అనుభవాలను గురుబంధువులందరితో గురుకృప ద్వారా పంచుకుంటున్నందుకు నాకు చాలా ఆనందముగా వుంది.

గాజువాక(విశాఖ) — మీ గురుబంధువు

20-4-2001 — లక్ష్మి

### గురుపూర్ణిమ

సాయిపథంలో సాయినాథుని శరత్ బాబూజీ ప్రవచనమ్లో "గురుపూర్ణిమ"కు ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. అదుకే ఆ రోజు గురుబంధువులందరు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు, సత్సంగాలు జరుపుకుంటారు. అయితే ఆ రోజు కేవలం దీపారాధన, నైవేద్యాది భౌతిక సంప్రదాయానికే కట్టుబడక, "శరత్ బాబూజీ" బాటలో పయనించడానికి "ప్రయత్నించాలి - ప్రతిన బూనాలి."

బాబాకు "శరణాగతి" చెందడం-"అహంకారం" తొలగించుకోవడం-అందరిని "ప్రేమించ" గలగడం, దేనివలనైతే మనకు ఇతరులవల్ల బాధ కలిగిందో దానిని ఇతరుల పట్ల చేయకుండా వుండడం. గురూజీ రచనలను, బాషణాలను పలుమార్లు చదివి, విని-అంతర్గత భావాన్ని అర్థంచేసుకోవడం - మొ||న సద్గుణాలను అలవరచుకొని ఆచరించినప్పడే మనం గురుపూర్ణిమనాడు నిర్వహించే గురుపూజకు సార్థకత.. సాఫల్యత.. కలుగుతాయి.

..గురుబంధువులు.

## "లేదు లేదిక మీ కరుణకు పోలిక"

"సాయినాథుని" అనుగ్రహంతో "గురూజీ" ఆశీస్సులతో నాకు కలిగిన అనుభవములను వ్రాస్తున్నాను. నా పేరు రుక్మిణి, మాది తెనాలి, రామలింగేశ్వరపేట. నేను క్రిందటి గురుపూర్ణిమకు షిర్డివెళ్ళినాను. బాబాను, గురువుగారిని దర్శించుకొని గురువుగారిని ఒకకోరిక కోరినాను. మా అబ్బాయికి రెండు సంవత్సరాల క్రితం పెళ్ళి అయినది. మా కోడలికి నేననంటే చాలా భయం, నేను కాని  మా అబ్బాయి కాని కొంచెం గట్టిగా మాట్లాడినా మా కోడలికి బి.పి.డౌన్ అయి చాలా నీరసంగా వుంటుంది, అని గురువుగారికి చెప్పి  నా కోడలు ఆరోగ్యం బాగా వుండేలా చేసి, మా అబ్బాయికి తొందరగా సంతానం కలిగేలా ఆశీర్వదించండి అని వేడుకున్నాను.  నేను షిరిడీనునండి వచ్చేటప్పుడు గురువుగారు, బాబా వున్న వాచీ కొన్నాను. అది మా అబ్బాయికి ఇచ్చి పెట్టుకోమన్నాను. నాకొద్దు నేను పెట్టుకోను అన్నాడు. నేను బ్రతిమలాడి నీవు పెట్టుకో మంచి జరిగితే వుంచుకో, లేకుంటే పెట్టుకోవద్దు అని ఇచ్చాను. వాచీ పెట్టుకొని షాపుకి వెళ్ళిన దగ్గరనుండి మంచి ఆర్డర్స్ వచ్చినవి అని ఇప్పటికీ వాచీని తీయకుండా వుంచుకున్నాడు. గురువుగారి దయవలన, బాబా దయవలన నా కోడలి ఆరోగ్యము కుదుటపడినది. నా కోడలు ఇప్పుడు గర్భిణీ అని డాక్టర్లు చెప్పినారు. నాకు చాలా ఆనందముగా వుంది.

నేను కూడా ఆరు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకున్నాను. గర్భసంచిలో కణితి వున్నది అని డాక్టర్లు చెప్పినారు, కణితిని తీసి రిజల్టుకు పంపినారు. రిజల్టు వచ్చేదాక నాకు చాలా భయం పట్టుకున్నది. ఎందుకంటే కేన్సర్ కింద వస్తున్నదేమోనన్న భయం. ఆ రిజల్టు వచ్చేదాకా బాబాని, గురువుగారిని ధ్యానించుకున్నాను. అంతా బాగానే వున్నదని రిజల్టు వచ్చింది. ఆపరేషన్ ముందు నాకు రక్తం చాలా తక్కువ వున్నదని ఇద్దరు డాక్టర్లుచెప్పినారు. ఎవరిని అడగాలి, ఏమిచేయాలి అని బాధపడుతున్నాను. ఒక రోజు తెల్లవారుజామున కలలో సత్సంగములో చెప్పు దొరుకుతుంది అని ఎవరో చెప్పినట్లుగా నాకనిపించి, వెంటనే సాయిగారి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పినాను. సాయిగారు సత్సంగములో చెప్పినారు అప్పుడు ముగ్గురు వ్యక్తులు వచ్చినారు. రక్తం ఇచ్చుటకు ఒకవ్యక్తిది సరిపోయినది. ఆ వ్యక్తికి నేను జీవితాంతము రుణపడివుంటాను. నా ఆరోగ్యం బాగుపడినది. ఆనందముగా వున్నాను. గురువుగారి దయవలన, బాబా అనుగ్రహం వలన తరువాత మా అమ్మాయిగారి ఇంటికివెళ్ళినాను. ఎక్కడకు వెళ్ళినా ఊదీని తీసుకువెళ్ళుట నా అలవాటు. మా అమ్మాయి వాళ్ళింటికి తెలిసిన వ్యక్తి వచ్చి తన బాధ చెప్పుకుంటున్నాడు, అది ఏమిటని అడిగాను. వాళ్ళ గేదె ఈని వారం అయినది. పాలు ఇచ్చుటలేదు, దూడను దగ్గరకు రానివ్వడం లేదు, పదివేలు పెట్టి కొన్నాను అని బాధపడినాడు. నేను ఒకటి చెపుతాను చేస్తారా అని అడిగాను. నమ్మకంతో చేయాలి మీకు ఇష్టముంటేనే అని చెప్పినాను సరే చెప్పండి అని అడిగారు. నేను ఏమి చెప్పానంటే షిరిడీ సాయిబాబాకు, గురువుగారికి నమస్కరించుకొని నా దగ్గర ఊది ఇచ్చి గేదె పొదుగుదగ్గర రాసి నమస్కరించండి అని చెప్పినాను. ఆయన మర్చిపోయి ఊరుకున్నారు. గేదెపాలు ఇచ్చుటలేదు ఎలాగ అని ఆలోచిస్తుంటే నేను ఇచ్చిన ఊది గుర్తుకు వచ్చి వెంటనే గేదెపైన జల్లి పొదుగు దగ్గర రాసి ఇంట్లోకి వెళ్ళినారు. తరువాత 1,2 గంటలలో గేదె దగ్గరకు వెళ్ళి చూస్తే పొదుగులో పాలు వస్తున్నాయి, దూడను పాలు త్రాగనిచ్చినదని చెప్పినారు. వాళ్ళు చాలా ఆనందముగా వచ్చి నాకు చెప్పినారు. ఆ గేదె రోజుకు 5 శేర్లు పాలు ఇస్తుందని. బాబా గురువుగారి అనుగ్రహము కావాలనంటే నమ్మకము, విశ్వాసము వుండాలి అనే దానికి ఇది ఒక ఉదాహరణ.

మా అబ్బాయి కోడలు క్రిందటి శ్రీరామనవమికి షిర్డి వెళ్ళినారు, వెళ్ళినప్పుడు బాబాను దర్శించుకొని గురువుగారిని చూద్దామని ఆశ్రమమునకు వెళ్ళి గురువుగారిని దర్శించుకొని మూడు కోర్కెలు కోరుకొని వచ్చినాము అని చెప్పినారు. అవి ఏమిటని అడిగాను. నాకు చెప్పలేదు, పని జరిగిన తరువాత చెపుతామన్నారు. అంటే ఈ శ్రీరామనవమికి ఒక సంవత్సరము అయినది. ఒక సం||నకే బాబా, గురువుగారి అనుగ్రహం వలన మా అబ్బాయికి సంతానం కలిగినది. ఇది ఆ మూడింటిలో ఒక కోరిక.

ఏప్రియల్, 2001 — రుక్మిణి - తెనాలి.

## "కదలాడు దైవమే గురువాయె నాకు"

గురువుగారు నాకు ఇచ్చిన ఈ అందమైన ఆనందమైన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నందుకు మనస్ఫూర్తిగా సంతోషిస్తూ.. నా పేరు మణి. మేము విశాఖపట్నం స్టీల్ ప్లాంటు క్వార్టర్స్ లో వుంటున్నాము. ఇక్కడ ప్రతి శనివారం 4 గం||లకు సత్సంగము జరుగుతుంది.

"నా బిడ్డలను ఎన్నటికీ పతనం కానివ్వను." అన్న బాబా అభయానికి నిదర్శనం నా ఈ అనుభవం. మాకు 2 సం||ల నుండి కారు కొనుక్కోవాలనే కోరిక వుండేది. అప్పుచేయకుండా కొనుక్కోవాలి అనుకునేవాళ్ళం. ఈ సం|| ఎలా అయిన కారు కొనాలి అని అనుకోవడం, మాకు రావలసిన 65 వేల రూ||లు రావడం జరిగింది. కాని 65 వేలకి కారు రాదు. కానీ కారు మాత్రం కొనాలి అనుకొన్నాము. మేమి ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్ళినా గురువుగారితో చెప్పకోవడం అలవాటు. ఆ అలవాటు ప్రకారం గురువుగారి ఫోటో వద్దకు వెళ్ళి, గురువుగారి వంక చూస్తూ "గురువుగారు మావద్ద 65 వేలు వున్నాయి. మాకు కారు కొనుక్కోవాలని వుంది. ఏదైనా మంచి కారు 60, 65 వేలలో వస్తే, అదే మాకు మంచిది అనిపిస్తే ఇప్పించండి. లేకపోతేవద్దు. అప్పు చేయకుండా కొనాలి, అప్పుమాత్రం చేయించకుండా అంతా మీరే చూసుకోవాలి, అని అనుకొని ఆ విషయాన్ని వదిలేశాము. మా బండికి ఏదో ప్రాబ్లమ్ వచ్చి మావారు మెకానిక్ వద్దకు తీసుకు వెళ్లారు. మాటల్లో మావారు ఏదైనా కారు వుంటే చూడమనడం, అతను వెంటనే ఒకతను ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోతున్నారు, మారుతీ కారు రెడీగా వున్నదని చెప్పడం, అతని ఫోం నెంబరు తీసుకోవడం వెంటవెంటనే జరిగాయి. ఇంటికి రావడంతోనే నాతో చెప్పి ఆయన ఫ్రెండ్ కి ఫోన్ చేసి కారుని చూడమనడం జరిగింది. మరునాడు మా వారు కారుని చూడటానికి వెళ్ళారు. ఆ సాయంత్రం ఫోన్ చేసి అడ్వాన్స్ ఇచ్చేసాము. కారు ఖరీదు 80 వేలు అని చెప్పారు. 4 రోజుల తరువాత కారు వచ్చింది. మేము అనుకున్నదేమిటంటే కారు కొంటే ముందుగా గురువుగారి ఫోటో పెట్టి, గురువుగారిని తలుచుకొని కారు ఎక్కాలని. కారు రాగానే అలాగే చేసాము. కారు రావడం అంతా బాగానే వుంది. కానీ 15 వేలు అప్పు అనగానే బాధగా అనిపించింది. అంతా గురువుగారే చూసుకుంటారని వదిలేసాను. మరునాడు ఆయన ఫ్రెండ్ ఫోన్ చేసి రమ్మనడం, ఆయన వెళ్ళడం జరిగింది. అక్కడ జరిగిందేమిటంటే - వెళ్ళగానే ఆయన ఫ్రెండ్ 20 వేలు చేతిలో పెట్టి మనకు కారు ఇచ్చినతను చాలా మంచివాడు, డబ్బు మనిషి కాదు.

60 వేలు చాలు అన్నాడు, 20 వేలు ఇచ్చేసాడు అని అన్నారు. మా వారికి చెప్పలేని ఆనందం కలిగింది. ఇంటికి వచ్చి నాతో చెబుతుంటే నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. గురువుగారివద్ద నిలబడి విషయం అంతా చెప్పకుని కృతజ్ఞత తెలుపుకున్నాను.

తన బిడ్డను ఎన్నటికి పతనం కానివ్వను అనడానికి నిదర్శనం ఇంతకన్నా ఏమికావాలి. గురువుగారి అనుగ్రహం ఎల్లప్పుడూ వర్షిస్తూనే వుంటుంది. కాని మనమే దానిని గుర్తించలేకపోతున్నాము. మమ్మల్ని అప్పుచేయనివ్వకుండా, మేము అడిగినట్లే ఆయన మాకు కారు ఇప్పించడం - ఎంత అనుగ్రహమో. ప్రతి చిన్న విషయానికి ఒక అమ్మగా, నాన్నగా, స్నేహితుడిలా ఇంకా చెప్పాలంటే అంతా తానై అందరిని రక్షిస్తూ, తన బిడ్డల్ని ఎల్లవేళలా కంటికిరెప్పలా కాపాడుతువున్న సద్గురువు మన గురువుగారే. గురువుగారి అనుగ్రహం అందరికి ఎల్లప్పుడూ వుండాలని, వుంటుందని ఆశిస్తూ గురువుగారు మా కిచ్చే మరిన్ని అనుభవాలను మరల మీతో కలిసి పంచుకోవాలని ఆశిస్తూ... గురుబంధువులందరికి మరోసారి దన్యవాదాలు తెలియజేస్తు,, మీ గురుబంధువు.

మణి మూర్తి.

## ఆదమరచి వున్నా - గురువు నిన్ను ఆదరించునన్నా

1995 మార్చి 29 వ తేది బుధవారం ఉదయం 6-15 ని||లకు జరిగిన బాబాలీల నేను తిరుమల ఎక్స్ప్రెస్ లో విజయవాడనుండి తిరుపతికి వెళ్ళునప్పడు, బుధవారం ఉదయం ముఖప్రక్షాలన కోసము రైలులోని టాయిలెట్ కి వెళ్ళేను. మామూలు అలవాటు ప్రకారం, చేతి వాచీ, ఉంగరం తీసి సోప్ ట్రేలో పెట్టి ముఖప్రక్షాలనం చేసిన తరువాత, వచ్చేటప్పడు వాచీపెట్టుకొని ఉంగరం పెట్టుకోవడం మర్చిపోవడం జరిగింది. టాయిలెట్ నుండి బయటకువచ్చిన 10 నిమిషముల తరువాత గుర్తుకువచ్చి టాయిలెట్ కి వెళ్ళి ఉంగరం పెట్టినచోట వెతికాను, కనిపించలేదు.

సుమారు 11 సం||ల క్రిందట నాకు బహుమానంగా వచ్చిన ఉంగరం అది. ఎలాగఅనుకుంటూ నాతోటి ప్రయాణీకుల చేతువేళ్ళు చూడటం మొదలు పెట్టాను. కొద్దినిమిషాల తర్వాత ఆ ఉంగరం నాకు చెందాల్సి ఉంచే తప్పక దొరుకుతుంది. అనుకొని వెతకడం మానుకొని ఎవ్వరిని చూడకునండా బాబాని, గురువుగారిని ధ్యానం చేసుకోవడం మొదలు పెట్టాను. ఈ లోగా రైలు ప్రక్క స్టేషన్ లో ఆగింది. కొందరు ప్రయాణీకులు దిగారు. మరికాసేపటికి ఇంకో స్టేషన్ లో రైలు ఆగడం బయలుదేరడం జరిగింది కాని, నా ఉంగరం కనిపించలేదు. నేను గురువుగారిని ధ్యానంచేస్తు ఉన్నాను.

సుమారు 7-30 గం||లప్పుడు ఇంకో 2,3 నిమిషములలో రైలు తిరుపతి చేరుతుందనగా నా ప్రక్కనున్న మనిషి ఎడమచేయిని నా ప్రక్కన ఉంచాడు. నా ఉంగరాన్ని పోలిన ఉంగరం అతనిచేతివేలికి ఉండటం చూసి ఏమండీ నా ఉంగరం పోయినది మీకేమయిన కనిపించిందా? అని అడిగాను. అది రిజర్వేషన్ కంపార్టమెంట్ ఎవరినైనా దొంగ అని అనుమానించినట్టయితే తోటి ప్రయాణీకులనుంచి ప్రతిఘటన ఉంటుంది. ఆ అనుమానంతోనే మెల్లగా అడిగాను. అప్పుడాయన ఉంగరం ఎట్టాపోయింది, ఎక్కడ పెట్టారు మొదలైన విషయములు ఆరాతీసి, తనచేతికున్న ఉంగరం తీసి ఇదేమో చూడండి అని యిచ్చాడు. నేనుసరిచూసుకొని, నాదే అని నిర్ధారణ చేసుకొని కృతజ్ఞతలు చెప్పడం, రైలు తిరుపతిలో ఆగడం అన్నీ ఒకేసారి జరిగినాయి. ఇది గురువుగారిని, బాబాని ధ్యానిస్తూ పోయినవస్తువు నిజంగా మనది అయితే తప్పక లభిస్తుంది అని భావిస్తూ ధ్యానంచేయడం వలన పోయినవస్తువు తిరిగి తప్పక లభిస్తుంది అని చెప్పే సాయినాథుని లీల ఇది.

నేను ఏవ్యక్తినైనాగాని, పై అధికారిని గాని కలవడానికి మనస్సు ఇచ్చగించనప్పుడు బాబాను గురువుగారిని స్మరిస్తూ ఉండటంవలన ఆవ్యక్తితో కలవడానికి ఏదో అడ్డంకి వచ్చి నా సమస్య పరిష్కారమవుతుండేది. సుమారు 1995 సం|| ఫిబ్రవరి నెలలో మా పై ఆఫీసర్ ఇన్ స్పెక్షన్ కి రావడం నాకు మనసులో సుతరాము ఇష్టంలేదు. ఆ ఆఫీసర్ ది అదోరకమైన మనస్తత్వం. అందరిని ఏడిపించి తను ఆనందించే మనస్తత్వం కలవాడు. మధ్యాహ్నం 2-00 గం||లకు ఇన్స్పెక్షన్ తయారుగా ఉండండి అని కబురు వచ్చింది. 1-30 గం లనుండు గురువుగారిని స్మరిస్తు సమస్య నుండి బయటపడవేయమని అడిగాను. ఇంకో 5 ని||లో ఇన్స్పెక్షన్ ఉంటుంది అనగా ఊళ్ళోకొచ్చి భోజనం చేసి విశ్రాంతి తీసుకునంటూ ఆ ఆఫీసరు గారు నేను వెనక్కి వెళ్ళిపోతున్నాను, వేరే అవసరమైన పని ఉంది అంటూ ఇన్స్పెక్షన్ ఇంకోసారి చేద్దాం అంటూ వెళ్ళిపోయారు. మనం బాబాను, గురువుగారిని స్మరిస్తూ మన సమస్య చెప్పుకుంటే మన సమస్య మబ్బు తెరలలాగా విడిపోవడం తప్పక జరుగుతుంది.

1994 డిసెంబర్ 17 వ తేదిన నేను మొట్టమొదటిసారి గురువుగారిని దర్శించడానికి తిరువణామలై పోయిన రూజు నేను, చంద్రకుమార్ గారు కల్ససి చిత్తూరులో సాయంత్రం 5-30 గం||లకు మధురై రైలులో తిరువణామలై వెళ్లామని అనుకున్నాము. మధ్యాహ్నం 12-45 ని||లకు హఠాత్తుగా మాపై ఆఫీసరుగారు ఇన్స్పెక్షన్ కు వచ్చారు. సాధారనంగా ఇన్స్పెక్షన్ కు వస్తే సాయంత్రం 7 గం||ల వరకు ఆయన ఉంటారు. ఆ రోజు మా ఆఫీసరుగారు 1.30 ని||లకు నన్ను ఇంటికి పోయి భీజనం చేసిన తరువాత వచ్చేయమని చెప్పారు. నేను కూడా త్వరగా భోజనం పూర్తిచేసుకొని 2.15 ని||ల కల్లా ఆఫీసుకు వెళ్ళినాను. ఒక విచిత్రమైన సంఘటన అంతకమునుపే ఒక్క నిముషం ముందు మా ఆఫీసరుగారు వేరేపని ఉందంటూ బస్సెక్కి వూరెళ్ళిపోయారు. ఈరకంగా నేను గురువుగారిని దర్శనం చేసుకోవడం జరిగింది. (18-12-94)

మన ప్లాను ప్రకారం షిరిడీపోదామని అనుకున్నా, గురువాజ్ఞ లేనిదే షిరిడీ పోలేము. వేసవి సెలవులలో గురువుగారు రమ్మన్నారు కదా అని ఎవ్వరికి చెప్పకుండా మే 11 వ తేది వెళదామని ఏప్రిల్ 24 వ తేదీన రిజర్వేషన్ చేయించాము. మన సాయిపథం ప్రెసిడెంటుగారికి చెపితే వారు టైము ఉంది గదా చూద్దాంలే అన్నారు. తీరా బయలుదేరేసరికి 8 వతేదీ రాత్రి నాకు హైదరాబాదులో వేరేపని ఉండటం మూలాన షిరిడీ పోలేక పోయినాను. ప్రెసిడెంటుగారు ఇప్పుడు కాదులే ఇంకొకసారి పోదువుగానిలే అన్నారు. సరే అన్నాను. తరువాత 18 వ తేది షిరిడి వెళ్ళడం జరిగింది. కనీసం 10 రోజులు ఉందామని ప్లాను వేసుకున్నాము. షిరిడీ చేరిన 3 వ రోజు ఒక కబురు అందింది. హైదరాబాదులో ఇంటర్వ్యూ ఒకటి ఉంది దానికి వెళ్ళాల్సివుంటుందని గురువుగారిని అడిగి ఆయన ఏది చెబితే అట్లా చేద్దామని అనుకున్నాము. గురువుగారు 23 వ తేది రాత్రి బయలుదేరి 24 వ తేది ఇంటర్వ్యూకి వెళ్ళమని ఆదేశించారు. 10 రోజులు వుందామనంటే 5 రోజులు ఉండి రావల్సివచ్చింది.

## గతితప్పని శరణాగతి

"నేడు గురుపూర్ణిమ, వెళ్ళి మశీదులోని ఆ స్థంబాన్ని పూజించు" అని సాయి దాదాకేల్కర్ కు ఇచ్చిన ఆదేశం. ఏ కాశీకో, ప్రయాగకో వెళ్ళి పూజించమనలేదు. అలా జరిగితే ఆ పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యమే మన గమనంలో ఉండేది. స్థంబాన్ని పూజించటమంటే ప్రత్యక్షంగా సాయి ఆజ్ఞను, పరోక్షంగా సాయిని పూజించినట్లే.

మరో సంఘటన మరో గురుపూర్ణిమకు శ్రీమతి చంద్రాబాయితో వెళ్ళి "ఉపాసనీ మహరాజ్ ను పూజించిరా" అన్నారు. ఉపాసనీ, చంద్రాబాయి సహపాఠి. సాయి ఆజ్ఞపాటించడంలో ఏమాత్రం ఏమరపాటు లేనిది ఆమె శరణాగతి! ఇద్దరు బలిష్టులైన వ్యక్తులను తీసుకొనివెళ్ళి (ఉపాసనీ అడ్డుకొంటారని) మరీ పూజించి వచ్చింది.

ఈ సంఘటనలు, పై భక్తుల గురువాక్య పాలనకు గీటురాళ్ళు. వీటిలో ఆంతర్యం, అంతరార్ధం కూడా ఏమరపాటులేని గురు ఆజ్ఞపాలన. స్థంబాన్ని పూజించడంలో ఆధ్యాత్మికత భవనంలా, స్థంభం మూలాధారంగా కేల్కర్ కు స్ఫురించిన, సాయి సంకల్పమూ అయినా కేల్కర్ ఆనాటి నుండి స్థంభాన్ని పూజిస్తూ ఉండేవాడు. ఆ స్థంభం ఈ నాడు శిరిడీ లో మరో గురుస్థాన్ అయ్యేది. చంద్రాబాయి ఉపాసనీనే గురువుగా ఎంచుకొని ఉండేది. ఉపాసనీని పూజించడం అదే మొదటి చివరిసారి అని చంద్రాబాయి చెప్పినట్లు చరిత్ర.

"సాయి చరిత్ర యావత్తూ, గురు ఆజ్ఞాపాలనలో శిక్షణే కనిపిస్తుంది."

పరమ నిష్టాచార సంపన్న కుటుంబంనుడి వచ్చిన కాకాదీక్షిత్ ఒక్కవేటుతో మేకను నరికేందుకు సిద్ధపడడం కూడా గురువు ఆదేశం పాటించడానికే. ఉత్తమ శిష్యుడు, మధ్యమ శిష్యుడు, అధమ శిష్యుడు ఇలా బేరీజు వేసుకుంటే మేకను నరికేందుకు ఆయన చేయి లేచేదే కాదు.

"గురువుకు పగ్గాలప్పగించడం అంటే మన ఆలోచనలు, సంకల్పాలు శమింపబడటం."

అంతరార్ధాలు, పరమార్ధాలు మన తెలివితేటలు (అహం) నుండి ఉద్భవించేవి.

అంతరార్ధాలు వెతికినంత మేర శరణాగతి మనలో లోపించినట్లే, అలుపెరుగని, ఏమరపాటులేని గురు ఆజ్ఞపాలనలో పరిపూర్ణులమైన నాడే మనకు నిజమైన **గురుపూర్ణిమ**.

పై వ్యాసము జులై 94 సాయిపథం పత్రికలోని సంపాదకీయం నుండి.

ఆ చేయి ఎంత హాయి... భాగము 13

## సమస్త అనుభవాలనిచ్చేది - సద్గురు సన్నిధే

మహనీయుడు గాని, మానవాతీతుడనిగాని, మహిమోపేతుడని గాని కోర్కెలు తీర్చుస్వామి అనిగాని, తెలిసిందా! ఆర్తులు, అర్థార్థులు, ఊరుకుంటారా! గుంపులు, గుంపులుగా కొలువుంటారు. అటువంటి మహాత్ముడు కాలినడకన బాటవెంట జనం మధ్యలో నడిచివస్తే సామాన్య ప్రజానీకానికి పండుగే. "నడయాడే దైవాన్ని" అనుసరించేవారు కొందరుంటే, వారి పాదపద్మములపై పడి నమస్కరించేవారు కొందరుంటారు. ఆయన వేసిన అడుగులో అడుగు వేయాలని అఱ్ఱులుసాచే వారుకొందరు. గౌతముడు నడయాడినచోట పరమపవిత్రమైన చోటని గౌతముని దర్శించిన చాలు సర్వకష్టాలు హరించుకుపోతాయని, జనంతండోపతండాలుగా గౌతమునితో తరలి వెళ్ళేవారు. అలాంటిస్ అంఘటనే శిరిడీలో గురువుగార్కి ఎదురైంది. 'సాయి యానా' కు, గురువుగారు తామున్న ప్లాటు నుండి నడిచి వచ్చేవారు. సాయి యానాకు ప్లాటుకు దూరం పెద్దగా లేకున్నా రావడానికి ఆలస్యం ఎందుకౌతున్నదో అర్థమైందనుకుంటాను. చూడాలని వచ్చేవారికి సాయియానా కంటే శిరిడీలోనే రోడ్డుమీద

త్వరితగతిన దర్శనమైపోతుందనే భావన కొందరిలో బాగా కలిగింది. అటువంటి అర్థార్థులు అక్కడికక్కడే నమస్కారాలు గావించడం ప్రారంభమయ్యేసరికి ఇటు వంటి వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. అర్థార్థుల కంటే అనుకరణాను రక్తులు మరింత అధికమైనారు. వీరికి విషయావగాహన లేకున్నా అధిక సంఖ్యాకులైన జనావళి ఎందుకు నమస్కరిస్తున్నారో తెలియకపోయినా? మనదేంపోయింది! ఖర్చులేని నమస్కారమే గదా! వస్తే పుణ్యమొస్తుంది అనే (భావనానుకరణ) భావనాకారులు ఎప్పుడైనా ఎప్పుడైనా ఎక్కువగానే ఉంటారు. వీరివలన జిజ్ఞాసువులకు, ఆధ్యాత్మికాభిలాషుకు, ఋజు మార్గ గమనాసక్తులకు అడ్డంకే.

సద్గురువు మహిమ ఇటువంటివారిలో మార్పుతెప్పిస్తుంది. అంతవరకు నిజమైన ఆధ్యాత్మికానుభూతి పొందాలని తాపత్రయ పడేవారిలో ఎడబాటును సహించలేరు. ఆలస్యాన్ని అంగీకరించలేరు. అటువంటివారికై గురువు సదా! తన సన్నిధిని అనుగ్రహిస్తుంటారు.

సద్గురుని స్వరూపము సదాకాంక్షించాలనే నిస్కాముని వైపునకే గురుగమనం సాగిపోతుంది. ఈతడెంతగా ఆరాటపడుతుంటే అంతకంతకు మించిన ఆరాటం ఆ సద్గురునిలో తొంగిచూస్తుంది. అప్పుడా గురువు ఎంత త్వరగానో వచ్చి ఆ ఆరాటకుని ఆనందపర్చుతారు. కానీ కాలికి పెనవేసుకొనిన తీగ నడకని సాగనివ్వని విధంగా అర్థార్థులు, అనుకరుణానురక్తుల నుండి బయటపడిరావాలంటే గురువుగారు కూడా కొత్త ఇబ్బందిని ఎదుర్కోవలసి వస్తుంది. ఇదోకోణమ్లో కనిపించే రీతి, మరో కోణంలో విమర్శకులు, భక్తిమాత్రోపజీవులు, అవిశ్వాసులైన కొందరు ఈ సన్నివేశాలను దర్శించి వారి స్థాయిలో మాట్లాడుకుంటారు.

ఈనేమైనా దైవమా? దైవంకంటే ఎక్కువా? ఇలా బాట వెంటకూడా పాదనమస్కారాలా! ఈ కోవలో దైవదూషణంగావించి పాపానికి అతి చేరువవుతారు. ఈ విషయం తెలిసిన గురువుగారు వారికెలాంటి 'వాచా' దోషమంటరాదని ఆశీర్వదించుతారు. సందర్శనాభిలాషులు గురు దర్శనం కోసం ఆరాటపడుతు వేచి ఉంటారు. గురుగమనాన్ని సాగనీయక గంటల తరబడి బాటవెంట అర్థార్థులు నిలిపివేయటం వలన గంటల తరబడి ఆలస్యమవుతున్నది. ఒకవైపు విమర్శకులు, మరొకవైపు సందర్శకులు, మరో వైపు అర్థార్థులు! ఇటువంటి సమయంలో తన బిడ్డను అన్నిటిబారినుండి 'బాబా' చక్కని సమన్వయపరిచారు. శ్రీమంతుడైన సాయిభక్తుడొకరు గురువుగారిని ప్రతీరోజు వారి వసతి గృహమునుండి సందర్శకులు వేచి ఉండే 'సాయియానా'కు కారులో తీసుకొని రావటానికి ఏర్పాటు జరిగింది. ఇది బాబా చూపినబాటే ఇలాంటి ఏర్పాటు జరిగినందువలన దారి వెంబడి దర్శనాలు, వారిని చూచి విమర్శించే విమర్శకులు, ఆలస్యంవలన కల్గే ఇబ్బందులెన్నో తొలగిపోయినవి. ఇలా కొంతకాలం గడిచింది.

రోజు గురువుగారు 'సాయియానా'కు రావడం, వారిని కలవాలని ఆశీర్వచనాలు పొందాలనే సందర్శకుల కోర్కెలు తీర్చివేస్తున్నారు గురువుగారు. యంత్రసంభందమైనదిగా! కారు, ఆ కారు చెడిపోయినది. దాన్ని వెంటనే హైదరాబాదుకు తరలించారు.

రోజు గురువుగారు కారులో వస్తున్నారుకదా! ఈ రోజు ఎలావస్తారు, అనే సంశయం నాకు కలిగింది. పైగా యస్.వి.యల్. నారాయణరావు గారు అంతకుముందు రాత్రే అత్యవసరపని ఉండి వారి సోదరులైన విజయరామారావుగారి కారులో హైదరాబాదు వెళ్ళారు. నా ఉద్దేశ్యమేమంటే యస్.వి.యల్. గారుంటే గురువుగార్కి ఎలాంటి అసౌకర్యము లేకుండా కారుచెడిపోయినా మరోచక్కని ఏర్పాటు చేస్తారు. మరీరోజు భానుమూర్తిగారున్నారు. చూడాలి ఎలాంటి ఏర్పాటు చేస్తారోనని వేచి ఉన్నాను.

రాత్రి 8 గం||లు దాటింది. గురువుగారు సాయియానా వస్తున్నారని తెలిసి గేటుదగ్గర నిలబడ్డాను. రోజు కారులో వస్తున్నట్టు గురువుగారు ఈ రోజు ఎలావస్తున్నారో చూడాలని కుతూహలంగా ఉన్నాను. ఆటో ఒకటి వస్తున్నది. అందులో ఎందుకుంటారు! ఎవరో గురుదేవుల ఆశీర్వాదమునకు వచ్చేటి వాళ్ళని, కారుకోసమే చూస్తున్నాను. సరిగ్గా నా ముందు ఆగిన ఆటోలోంచి గురువుగారు కనిపించారు. ఆశ్చర్యము, ఆనందము, నా అహంకార విమోచనము ఏకకాలంలో కలిగినది. అది వరకు కారులొ వచ్చేటప్పుడు ఎంతో గంభీరంగాను, కాలుమీదకాలు వేసుకుని వచ్చినట్లుగానే గురువుగారు ఆటోలోను అంతే గంభీరంగాను ఇంకా మరింత హుందాగాను వచ్చారు. ఇక్కడ ఆశ్చర్యము. మెత్తని కారు సీటులో వెనుకభాగంలో దర్జాగా ఆనుకొని వచ్చినట్లుగానే, ఆటోలోను అంతే. మట్టిని, బంగారాన్ని సమానదృష్టితో

చూచేవాడే యోగి పుంగవుడనే గీతా వాక్యం పదే పదే గుర్తుకు వచ్చింది. ద్వంద్వాతీతులు-మహనీయులనే యదార్థాంశము నాకంటిముందు కదలాడింది. ఆశ్చర్యమే ఆశ్చర్యం.

'రఘువంశ' కర్తయగు కాళిదాసు 'రాముని' విషయంగా 12 వ సర్గలో ఇలా వ్రాసారు. 'రామా'! నీకు తెల్లవారితే రాజ్యాభిషేకము అని చెప్పారట. ఆమరుసటి దినము నీవు అరణ్యవాసానికి బయలుదేరాలన్నారట. రాజ్యాభిషేకము అన్నప్పడు రాముడు పొంగిపోవడం కాని, ఆనందపడుటముగాని జరుగలేదు. అరణ్యవాసానికి సిద్ధం కావాలని చెప్పినప్పడు క్రుంగి పోవడం కాని, విచారపడటంకాని జరుగలేదు. ఈ రెండు లక్షణాలు రాముని ముఖములో స్పష్టంగా దృగ్గోచరమైనదని చెప్పిన స్థితిని, స్వయంగా కాళిదాసు చెప్పిన భావాన్ని చూచే భాగ్యం నాకు లభించింది. ఆ సమయంలో ఆనందం కలిగింది.

'స్వామి సమర్థ' (అక్కల్ కోట) ఒకరోజు దర్శనాలిస్తున్న సమయంలో స్వామి గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నారట వచ్చిన భక్తులు వారి పాదాలకు నమస్కరించి వెళ్ళిపోతున్నారు. దర్శనాలకు వచ్చినవారిలో, స్వామి అంటే ఇలా వేళాపాళా లేకుండా ఇట్టానిద్దురపోతారా! ఇతనేం స్వామి అనుకున్నాడట వెంటనే స్వామి!! ఓరేయ్ కంసలోడా! నేను నిద్దపోలేదురా! మేల్కొనే ఉన్నానని, స్వామిమరల గుఱ్ఱుపెట్టారని చరిత్ర చెప్పింది. ఇది గుర్తుకు వచ్చేసరికి అహంకార వియోచనమైంది.

'వ్యక్తిత్వపు విలువలను' భావన నీకు స్పష్టంగా అర్థమైందిగదా! అన్నట్లుగా నా వంక చూసి నాశిరము పై చేయివేసి ఆశీర్వదించి నవ్వుతూ లోనికి వెళ్ళారు గురువుగారు. మహనీయుల సన్నిధిలోనే ఎన్నో అనుభవాలు, అనుభూతులు సాధకుడు పొందగల్గుతాడు ప్రాణాయామాలు యోగాసనాదులవలన శారీరక యోగ్యత ఉంటుందేమోగాని, 'సద్గురు సన్నిధిని' మించింది మరోకటిలేదనిపించే.

ఆసక్తికరమైన మరిన్ని అంశాలు కావాలంటే ఈ సారి గురుకృపకై వేచి ఉండాల్సిందే.

సమర్పణ : డా|| యస్. సాయి వరప్రసాదరావు   రీడరు : రేపల్లె

బాబా కృపాకటాక్ష వీక్షణాలు ఎప్పడూ అందరిమీదా కుండపోతగానే వర్షిస్తున్నాయి. కాని మనం అహం, అజ్ఞానం అనే గొడుగు ఆ అనుగ్రహధారలు మన మీద పడకుండా అడ్డుకొంటున్నది. మన అజ్ఞానాన్ని తొలగించుకొని ఒకసారి కళ్ళు తెరచి చూస్తే బాబా కృపాదృష్టి ఎప్పడూ మనమీదనే ఉన్నదని గ్రహిస్తాం. బాబా కృపాదృష్టి ఎప్పడూ మన మీద ఉన్నదన్న గురుతే, ఆ ఎఱుకే మనకు గురువై మనల్ని రక్షించి తరింపచేస్తుంది.

## మహనీయుల మహితోక్తులు....

మహిలో సంచరిచుతు మహాత్ములు మానవ మనుగడను సందర్భానుసారంగా దేశకాల పాత్రతలను బట్టి రాబోవు తరంవారు తరించు తరుణోపాయమును తమ అనుభవైక వాక్యాల రూపమ్లో వివరించారు. వాటిని గానం చేసారు. ఇది వేద వాక్యమంత పవిత్రమైనది, తల్లిలా సత్యమైనది. కబీరు గీతాలు ఈ కోవలోనివే. కొన్ని సందర్భములలో బాబా వాక్యాలు సరి తూకమ్లో పాటమరించగలవు. అటు కబీరు భావం, ఇటు బాబా భావం తుల్నాత్మక సరళిలో గురుకృపలో రాబోవు సంచికలలో చూడగలము. కబీరు గీతాలను గురుచరణదాసుడు తెలుగు సేతగావించి గురుకృపకు అందించినారు. గురుబంధువులకు అటు కబీరు భావాలకు బాబా సూక్తులు పరిచయం కాగలదని గురుకృప ఆశిస్తున్నది.

కబీరు అనుచున్నారు.

సుగంధములమ్ము అంగడి వంటిది

సాధుసజ్జనుల సత్సాంగత్యమలాంటిది.

పరిమళ ద్రవ్యములు కొనకున్నను
సువాసనలు నిన్నంటుకొనును.

పై గీతములో సంతపురుషులతో కలయిక, సత్సాంగత్యము యొక్క గొప్పతనాన్ని వివరించారు. మంచి సువాసనలు కలిగియున్న (సెంటు, అత్తరు మొ||) దుకాణంలోనికి వెళ్ళివచ్చిన చాలు, కొనకున్నను పర్వాలేదు, నిన్ను ఆ సువాసనలు అంటిన విధంగానే, సాధు సంతుల దర్శనము, సత్సాంగత్యము, అలాంటిదేనని కబీరు అనినారు.

పై గీతములో చక్కని భావనతోపాటు చమత్కార గర్భితమైన హెచ్చరిక వుంది. సువాసన గల్గిన అత్తరును ఎంచుకొను విధంగానే సరియగు సాధుసజ్జనులను, సత్సంగమును గమనించు కోవాలి. 'నీరు' అంటే త్రాగునీరునే 'నీరు' అని అంటారు. లోతైన భావాన్ని గమనించాలి.

కబీరు అనుచున్నారు.
నిన్న నేడు రాని మృత్యువు
రేపన్న తప్పక వస్తుంది
విరబూసిన సుమాలను నేడు కోసినట్లుగా
విరబూసే సుమాలు రేపటికంతేగా

తోటలో విరబూసిన కుసుమాలను తోటమాలి కోసివేయగా, విరబూయబోయే కుసుమ అనుకున్నదట "ఈ రోజు ఆ సుమాన్ని కోసినట్లే రేపు విరబూసిన నేను అంతేగా" ఈ సన్నివేశాన్ని గమనించిన కబీరు జీవులంతా సుమాలవంటివారైతే మృత్యువే ఆ తోటమాలి అన్న గంభీరభావాన్ని తేటతెల్లంగా విరించారు.

... గురుచరణదాసుడు.

## బాబా పథం

దేవుడే పుట్టితే సాయిరూపం!
మనిషి దైవంగ పెరగటం బాబామతం ||దేవుడే||
ఆనంద జీవనం సాయీ జగం
అహము వదిలేయుటే బాబా హితం
మనము అహము వదిలేయుటే బాబా హితం |దేవుడే||
యోగభోగంబుల సంయోజనం
చింతలను బాపుటే బాబావరం
ఆనందదాయకం సాయిపథం
మనను గమ్యంబు జేర్చేటి బాబా రథం ||దేవుడే||

భిక్ష అడిగే సాయి వైరాగ్యము
బదులు యిచ్చును బాబా సౌభాగ్యము
అడిగింది ఇచ్చుటే సాయి శపథం
అడగటం నేర్పుటే బాబా పథం ||దేవుడే||
అంతటా నిండిన సాయి పాదం
చూచి చూపెట్టుటే బాబా పథం
అడుగడుగునా అదియే అభయప్రదం
సాయిభక్తులకు బ్రతుకంతా శోభప్రదం ||దేవుడే||
.

**.. శ్రీ బాబూజీ..**